# దీపశిఖ

సాయంత్రం ఐదు గంటలవుతోంది.

మా యింటి ఎదురుగా రామమందిరం వరండా మీద చేరి పిల్లలంతా నాలుగు స్తంభాలాట ఆడుకుంటు న్నారు. నేను వాకిట్లో సంజె ముగ్గు వేసి లోపలికి తిరిగాను.

అదుగో,—అప్పుడు రిక్షా దిగింది—మా వసుంధర.

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి—ఆడపడుచు—పుట్టింటి గుమ్మం తొక్కింది ?

అదంతా పెద్ద కథ. ఇరవై ఏళ్ళ క్రితం మా సత్యమూర్తి బారసాలనాటి సంగతులు, పిలుపులూ, పెట్టుపోతలూ తక్కువయ్యాయని తమ్ముడితో మాటా మాటా పెంచుకుని వెళ్ళిన మనిషి. అంతే. అప్పుడప్పుడూ మా వాళ్ళ ఇళ్ళల్లో శుభకార్యాల్లో కలుసుకుంటున్నా మళ్ళీ ఇన్నాళ్ళకి తనంత తానుగా మా యింటి కొచ్చింది.

ఎక్కడా న్యూనతాభావం కలగనీకుండా—వసుంధరని ఆప్యాయంగా ఆహ్వానించాను. కాఫీ ఫలహారాలు అయిన తర్వాత కబుర్లల్లో పడ్డాము.

వసుంధర తన పిల్లలు—వరలక్ష్మి, మోహన్, అర్చనల్ని గురించీ, వాళ్ళ చదువుల్ని గురించీ చెప్పింది. నేనూ,—మా సత్యమూర్తీ, రాజేశ్వరీ, రామం గురించి చెప్పుకొచ్చాను.

నేను వంటపనిలో వుండగానే వచ్చేశారు మావారు. అక్కా తమ్ముడూ పరామర్శలు మొదలయిన్నై.

“ జరిగిందేదో జరిగిపోయింది. మిమ్మల్ని అందర్నీ చూడాలనిపించి వచ్చేశాను. ఈ పంతాలూ పట్టింపులతో కట్టుకు పోతామా ” వసుంధర అనడం వినిపించింది నాకు.

రెండురోజులు ఇట్టే గడిచిపోయిన్నై.

ఆరాత్రి డాబామీద వెన్నెల్లో కూర్చున్నాం.

మావారు మొదలెట్టేరు ; “ సత్యమూర్తి ఎం. ఏ. అయింది. తర్వాత ఏం చేయాలా అని చాలా ఆలోచిస్తున్నాం. ఏ ఢిల్లీలోనో కూచుని దీక్షగా ఐ. ఏ. యస్ కి చదవమంటున్నా న్నేను. వాడికేమో రిసెర్చ్‌లో చేరదామని వుంది. వాళ్ళ ప్రొఫెసర్లంతా పిహెచ్.డి చేసి అక్కడే ఉద్యోగం చెయ్యమని సలహా ఇస్తున్నారట. ఎలాగైనా రాంక్ స్టూడెంటు గదా—వాళ్ళ అభిమానం వాళ్ళది. ఇంకా ఏదీ తేలలేదు. ఏది ఏమైనా వో రెండేళ్ళపాటు వాడు చదువులో వుండాల్సిందే. వీడి సంగతి ఇలా వుంటే, రాజేశ్వరేమో డిగ్రీ పూర్తిచేస్తోంది. దాని సంగతీ ఆలోచించాలి...”

ఆ తర్వాత అక్కడంతా నిశ్శబ్దం పరచుకుంది. ఆకాశం లోని నక్షత్రాల్ని చూస్తూ, పడుకున్నాన్నేను. మంచంలో పక్కకి వత్తిగిలి, దీర్ఘంగా నిట్టూర్చింది వసుంధర.

తెల్లవారుతూనే తిరుగు ప్రయాణం కట్టింది—వసుంధర. చీరె, రవిక పెట్టి పసుపు కుంకుమలతో, పిల్లలకి స్వీట్స్‌తో పంపించాము.

బస్‌స్టాండులో—నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని "మమ్మల్ని మరిచిపోకండి" అని కంటతడి పెట్టుకుంది.

"ఛా...ఛా...అవేం మాటలు" అని ఊరడించాను.

వసుంధర వెళ్ళిపోయింది.

ఆమె అటు వెళ్ళగానే ఇటు వచ్చాడు విశ్వం. విశ్వం మా మరిది. తరచుగానే వస్తూ వుంటాడు. విశ్వం వచ్చాడంటే ఎండలో మబ్బులా చల్లబడుతుంది వాతావరణం. పిల్లలకి మిఠాయి పొట్లాలూ, కామిక్ బుక్సూ తెచ్చేడు విశ్వం.

వాళ్ళన్నయ్యకి ఇష్టమని ఇంత చిక్కా, నా కోసమని వో కిలో పాపొడీ పట్టుకొచ్చేడు.

వసుంధర వచ్చి, అప్పుడే వెళ్ళిపోయిందని తెలిసి చాలా నొచ్చుకున్నాడు. పిల్లలు ఎవరి పనులమీద వాళ్ళు వెళ్ళారు. మావారు ఆఫీసుకు సెలవుపెట్టి ఇంట్లో వుండిపోయేరు. ఇద్దరూ ఆఫీసులో తమ తమ ఘనతని గురించీ. తమ తమ ప్రాముఖ్యత గురించీ—అప్రస్తుతమైన ఆత్మ స్తుతులతోనూ, అసందర్భమైన పరనిందలతోనూ కాలక్షేపం చేశారు.

ఆకలి కరకరలాడింది. భోంచేసి నిద్రపోయారు. మూడింటికి లేచి పకోడీలు తిని, టీ తాగేరు.

అప్పుడు మొదలెట్టేరు మావారు, "ఇల్లు కట్టించి అప్పుల్లో పడిపోయాను. మీ వదిన నగలన్నీ బాంక్‌లో వున్నై. దానికితోడు ఈ నెలలో సత్యమూర్తి స్కూటర్ కావలసిందేనని పట్టు పట్టడంతో—వాయిదాల్లో తీశాను. ఏడాది గడిస్తేగానీ పి. యఫ్. లోను రాదు. అక్కయ్యతో మాటవరసకి ఇవన్నీ చెప్తే, 'విశ్వం ఏమన్నా సర్దుతాడేమో కనుక్కోరాదూ' అంది. రేపో మాపో లెటర్ రాద్దామనుకుంటుంటే నువ్వే వచ్చావ్."

గొలుసుకట్టులా సాగిపోతోంది మావారి ప్రసంగం.

విశ్వం అదోలా నావైపు చూశాడు. మంచంమీదనుంచీ దిగి బాత్‌రూమ్‌కేసి నడిచాడు. మొహం కడుక్కొచ్చి, 'మా డైరెక్టర్ని చూసి అటునుంచీ అటే వెళ్తాను. నే వస్తా మరి' అంటూ బయటికి కదిలేడు.

అతనికేసి పరీక్షగా చూసేను. పెద్దవాళ్ళ ముందు ఏడవ కూడదని మొహం పక్కకి తిప్పుకున్న పిల్లవాడి తరహాగా వుంది—విశ్వం వాలకం!

సాయంత్రం—నేనూ మావారూ—పెరట్లో పొగడచెట్టు క్రింద రాతిబెంచీమీద కూర్చున్నాం. తలవంచుకుని కుండీలో నూరువరహాలమొక్క తుంపుతున్నారు మావారు. ఉన్నట్టుండి తల పైకెత్తి—నావైపు చూశారు. చూపుల్లో ఎన్నెన్నో

సెలయేళ్ళు దుముకుతున్నై. "ఏంటి ?" అన్నాను—చాలా మంద్రస్వరంతో.

"ఏవేవో జ్ఞాపకాలవల్ల కళ్ళు చెమ్మగిలుతున్నయ్.—వసుంధరా, విశ్వం—ఇద్దరూ నాలుగు రోజుల్లో ఉత్తరాలు రాస్తారు. చూస్తూ వుండు." అన్నారు.

క్షణాల తర్వాత లేచి నెమ్మదిగా కదిలేరు. నేనూ అనుసరించాను.

మమ్మల్ని చూసి ఆగింది పక్కింటి పున్నమ్మగారు. "మీ దయవల్ల ఈ ఏడాది మన వీధికంతా నీళ్ళ ఎద్దడి లేకుండా పోయింది. బయటంతా బిందె రూపాయికి అమ్ముతున్నారట" బుజంమీది బిందె సర్దుకుంటూ అన్నది.

"బోరు కొట్టిస్తే అదృష్టవశాత్తూ బుగ్గ పుట్టింది. ఉన్నంతలో నలుగురికీ పంచుతున్నాం. తీసికెళ్ళండి." మావారే ఈ మాటలన్నది.

నాకు కొంత అర్థమైంది. కొంత అర్థంకాలేదు.

మావారన్నట్టుగానే—నాలుగురోజులకి వసుంధర నుంచి ఉత్తరం వచ్చింది. వాళ్ళ అర్చనని మా సత్యమూర్తికి చేసుకుంటామో లేదో కనుక్కోవాలని వచ్చిందిట ! ఏ సంగతీ వెంటనే రాయమంది. ఆవేళే మా విశ్వమూ లెటర్ వ్రాశాడు. అన్నగారికి సహాయపడలేడట—"న్యాయానికి నేనే నిన్ను డబ్బు అడగాలని వచ్చాను." అంటూ సారీ చెప్పుకున్నాడు.

ఆ రాత్రి—

'ఏమిటి విషయం' అని అడిగేను—మా వారిని. "స్వప్రయోజనానికి తప్ప పనికిరాని చుట్టరికాలు. మొదలు చెడ్డబేరం చెయ్యకూడదని జ్ఞానోదయమైంది. చూసయినా మనమూ తెలిపి తెచ్చుకోవాలి. అందుకే ముందరి కాళ్ళకి బంధం వేశాను." అన్నారు.

"మరి పున్నమ్మతో వ్యాఖ్యానం?" నా సందేహాన్ని బయటపెట్టాను. "అది క్రీస్తు చెప్పిన సూక్తి. ఏ యింటినుంచీ యాత్రని మొదలెట్టామో దాన్ని మరిచిపోకుండా వుండటం."

ఎన్నో ఆలోచనలు ముసురుకున్నై.

గదిలో దీపం నిశ్చలంగా వెలుగుతూనే వుంది!

$0_0 0$